సాక్షి
కామారెడ్డి
గురువారం । 24 । ఆగస్టు । 2023



రెగ్యులరైజ్ చేయాలి

తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులు పంపించారు.

- 11లో ▸



కమిషన్ ఏర్పాటు చేయాలి

వేతన సవరణ కమిషన్‌ను వెంటనే నియమించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డిమాండ్ చేశారు.

- 11లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.6 /22.6

వాతావరణం

ఉదయం చల్లగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఇస్రోకు అభినందనలు

బాన్సువాడ: చంద్రయాన్–3 విజయవంతానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బందికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. జాబిలిపై విక్రమ్ ల్యాండర్ క్షేమంగా చేరడంతో దేశ ఖ్యాతి మరింత ఇనుమడించిందన్నారు. ఇది దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజని పేర్కొన్నారు.

విత్తనక్షేత్రంలో వరినాట్లు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట: మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో ఎట్టకేలకు వరి నాట్లు ప్రారంభమయ్యాయి. 'విత్తన క్షేత్రంలో వెనకబడిన సాగు' శీర్షికన బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన విత్తన క్షేత్ర అధికారులు బుధవారం 20మంది మహిళా కూలీలతో మూడెకరాలలో వరి నాట్లు వేయించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సన్నరకానికి చెందిన కేఎస్‌ఎం–1638 వరిని 20 ఎకరాలలో సాగు చేస్తున్నామని విత్తన క్షేత్ర అధికారులు తెలిపారు. నాలుగైదు రోజుల్లో నాట్లను పూర్తి చేస్తామన్నారు.

'శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు'



బాన్సువాడ: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం బాన్సువాడ రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. కేసుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లాలో 2,386 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉందని, 80 మేజర్ కేసుల్లో 75 శాతం కేసులు పరిష్కరించామని పేర్కొన్నారు. పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్నామన్నారు. దుర్కి వద్ద ఓ రైతునుంచి డబ్బులు దొంగిలించిన కేసును త్వరలోనే ఛేదిస్తామన్నారు. షీటీం పనితీరులో జిల్లా నంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు. అనంతరం పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, రూరల్ సీఐ మురళి, టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి, సిబ్బంది రాములు, రఘు, ప్రమోద్‌రెడ్డి, సంగమేశ్వర్ తదితరులున్నారు.

'కామారెడ్డి కళాశాలలో అదనపు సీట్లు'

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కొన్ని గ్రూపులలో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ అదనపు సీట్లను మంజూరు చేసింది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దోస్త్ తాజా రిజిస్ట్రేషన్ కోసం రూ. 400 చెల్లించాల్సి ఉంటుందని, 9న సీట్లను కేటాయిస్తామని, 15లోగా కళాశాలలో రిపోర్టు చేయాలని తెలిపారు.

సంస్కృత భాషపై ఆన్‌లైన్ ద్వారా శిక్షణ

కామారెడ్డి అర్బన్: సంస్కృత భారతి ఆధ్వర్యంలో జూమ్ యాప్ ద్వారా పదిరోజుల సంస్కృత భాష శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సంస్కృత భారతి నల్గొండ విభాగ్ సంయోజక్ ఆచార్య సింహాచలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్కృతభాష గొప్పతనం, అక్షరాలు పలికే విధానం, మాట్లాడడం నేర్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 96407 23246 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎంపికైన అభ్యర్థులకు 26 నుంచి వైద్య పరీక్షలు

కామారెడ్డిక్రైం: పోలీసు శాఖలో(సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, ఎస్పీఎఫ్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ జైలర్) ఎస్సై, ఏఎస్సై నియామకాలకు అర్హత సాధించిన జోన్–3 అభ్యర్థులకు 26 నుంచి 28 వరకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సిరిసిల్ల జోన్ డీఐజీ రమేష్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలుంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు శుక్రవారం సాయంత్రం 5 గంటలవరకు కరీంనగర్ కమిషనరేట్‌లోని సీఏఆర్ ఏసీపీ, ఆర్ఐ అడ్మిన్‌లకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

సంబురమే!

- 'చంద్రయాన్'ను వీక్షించేందుకు టీవీలకు అతుక్కుపోయిన జనం
- కాలేజీలు, స్కూళ్లలో ప్రత్యేక స్క్రీన్‌ల ఏర్పాటు
- విక్రమ్ సాఫ్ట్ ల్యాండింగ్‌తో హర్షాతిరేకాలు



గాయత్రి కాలేజీలో చంద్రయాన్ ల్యాండింగ్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

సాక్షి, కామారెడ్డి: భారత్ ప్రయోగించిన చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్ చంద్రుడి భూభాగంపై క్షేమంగా అడుగిడడంతో జిల్లావ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. సుమారు గంటకుపైగా టీవీలు, ఫోన్‌లు, భారీ స్క్రీన్లకు అతుక్కుపోయిన జనం.. ల్యాండర్ దక్షిణ ధ్రువంపై సురక్షితంగా ల్యాండ్ కాగానే కేరింతలు కొట్టారు. జిల్లాకేంద్రంలోని సాందీపని, శ్రీసాందీపని, శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలల్లో ప్రత్యేకంగా ఎల్ఈడీ భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి చంద్రయాన్‌ను వీక్షించారు. జిల్లాలోని పలు ప్రాంతాలలో ప్రజలు, విద్యార్థులు ఎల్ఈడీ స్క్రీన్లపై కార్యక్రమాన్ని తిలకించారు. విక్రమ్ ల్యాండర్ ల్యాండ్ కాగానే పెద్ద ఎత్తున జై భారత్, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. జిల్లాకేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.



ఇస్రో ఆకారంలో చిన్నమల్లారెడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



'రియల్' జోష్!

కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీ నేపథ్యంలో...

నిన్నటివరకు స్తబ్దుగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కదలిక వచ్చింది. సీఎం కేసీఆర్ కామారెడ్డినుంచి పోటీ చేస్తారన్న ప్రకటన వ్యాపారుల్లో ఒక్కసారిగా జోష్ తెచ్చింది. సీఎం పోటీచేస్తే అభివృద్ధికి భారీ ఎత్తున నిధులు వస్తాయని ఆశిస్తున్న జనం.. భూముల ధరలకూ రెక్కలు వస్తాయని భావిస్తున్నారు. దీంతో రియల్ దందాకు తిరుగుండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

– సాక్షి, కామారెడ్డి

- అభివృద్ధి పరుగులు తీస్తుందని భావిస్తున్న జనం
- భూముల క్రయ, విక్రయాలు పెరుగుతాయన్న ఆశలు
- ధరలు పెరిగితే సామాన్యుడికి కష్టాలే...

కామారెడ్డి పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడే నాటికే ఇక్కడ భూముల ధరలు అడ్డగోలుగా పెరిగాయి. జిల్లా అయిన తర్వాత మరింతగా పెరిగి సామాన్యుడు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. కామారెడ్డి పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాల్లోనూ పెద్ద ఎత్తున ప్లాట్ల దందాతో రూ. కోట్లల్లో వ్యాపారం నడిచింది. ఊహిచనంతగా సాగిన రియల్ దందాతో కొందరు ఆర్థికంగా అందనంత ఎత్తుకు ఎదిగారు. ఇక్కడ డబ్బులు సంపాదించిన వారు 44వ నంబరు జాతీయ రహదారిపై రామాయంపేట, చేగుంట, తూప్రాన్, మేడ్చల్ దాకా భూములు కొనుగోలు చేశారు. ఎక్కడ వెంచర్లు చేసినా అందులో కామారెడ్డి ప్రాంతానికి చెందిన వ్యాపారుల భాగస్వామ్యం ఉండింది. ప్లాట్ల దందాతో పాటు నిర్మాణ రంగంలోనూ వ్యాపారులు ఆరితేరారు. హైదరాబాద్‌లోనూ భారీ అపార్టుమెంట్లు, విల్లాలు నిర్మించి విక్రయించే స్థాయికి ఎదిగారు.

అందనంత స్థాయిలో...

కామారెడ్డి పట్టణంతో పాటు చుట్టుపక్కల వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేయడం సామాన్యుడికి భారంగానే మారింది. పట్టణంలో ఇళ్ల మధ్య ప్లాటు తక్కువలో తక్కువ గజానికి రూ.20 వేలు పలుకుతోంది. ఇల్లు నిర్మించుకునేందుకు ప్లాటు కొనుగోలు చేయాలంటే వంద గజాలకు రూ.20 లక్షలు వెచ్చించాల్సిందే. మధ్య తరగతి ప్రజలకు ఇది భారమే.. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, ఇతర ఖర్చులకు సరిపోని సంపాదనతో ఇప్పటికే ప్లాట్లు కొనే పరిస్థితి లేకుండాపోయింది. ప్లాట్ల ధరలు ఇంకా పెరిగితే సామాన్యుడు ఆశలు వదులుకోవాల్సిందేనన్న భావన వ్యక్తమవుతోంది.

కరోనాతో అతలాకుతలం

ఊపు మీదున్న రియల్ దందాను కరోనా దెబ్బకొట్టింది. భూముల క్రయ, విక్రయాలు గణనీయంగా తగ్గాయి. వైరస్ ప్రభావం దాదాపు రెండేళ్ల పాటు ఉండింది. రియల్ దందాలో పెట్టుబడులు పెట్టిన వారు చాలా మంది ఆర్థికంగా ఇబ్బందులపాలయ్యారు. కరోనా మూలంగా ప్లాట్లను కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. అత్యవసర పరిస్థితుల్లో ప్లాట్లను అమ్ముకునేందుకు ప్రయత్నించినా కొనేవారు లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. కొన్న ధరకన్నా తక్కువకు అమ్ముకుంటే నష్టపోతామన్న భావనతో కొందరు వ్యాపారులు వడ్డీలకు వడ్డీలు కట్టి నష్టపోయారు. ఇప్పుడిప్పుడే దందా కోలుకుంటున్నా.. మునుపటి జోష్‌లేదు. వెంచర్లు చేసి వాయిదాల పద్ధతిన ప్లాట్లు విక్రయించే ప్రయత్నాలు చేసినా జనం పెద్దగా ఆసక్తి చూపలేదు. ధరలు అడ్డగోలుగా పెరగడంతో ప్లాట్లు కొనేవారు తగ్గిపోయారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ధరలు కామారెడ్డిలో ఉండడంతో డబ్బులున్నవారు అక్కడే కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు. మధ్య తరగతి అందుకోలేనంతగా భూముల ధరలు పెరిగిపోయాయి. ఫలితంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్తబ్ధత ఏర్పడింది.

రియల్ ఎస్టేట్ వర్గాల్లో నూతనోత్సాహం

కొంతకాలంగా వ్యాపారం దెబ్బతిని ఇబ్బందుల్లో ఉన్న రియల్ వ్యాపారులు, ఏజెంట్లలో సీఎం కేసీఆర్ కామారెడ్డినుంచి పోటీ చేస్తారన్న ప్రకటన ఉత్సాహాన్నిచ్చింది. సీఎం పోటీ చేస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. దీంతో భూముల క్రయవిక్రయాలు పెరుగుతాయని, రియల్ బూం వస్తుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆశిస్తున్నారు. ఎవరిని కదిలించినా కామారెడ్డిలో రియల్ దందా పరుగులు తీస్తుందని చెబుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన దేవునిపల్లి, టేక్రియాల్, లింగాపూర్, ఇల్చిపూర్, అడ్లూర్, రామేశ్వర్‌పల్లి, సర్సన్నపల్లి, సరంపల్లి, పాతరాజంపేట, పొందుర్తి తదితర గ్రామాలతోపాటు తాడ్వాయి, పాల్వంచ, దోమకొండ, భిక్కనూరు, రాజంపేటల పరిధిలోని భూములు, ప్లాట్ల అమ్మకాలు పెరిగే అవకాశాలున్నాయి.

'అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే హన్మంత్ సింధే కోరారు. బుధవారం బిచ్కుందలోని మున్నూరు కాపు సంఘంలో నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఆసరా పింఛన్‌పెంపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మగౌరవంతో జీవించాలన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం పెన్షన్‌ను రూ. 4,016కు పెంచిందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నియోజకవర్గంలో వెయ్యి మంది దివ్యాంగులకు పెన్షన్ వచ్చేదని, ఇప్పుడు 5 వేల మందికి ఇస్తున్నామని పేర్కొన్నారు. తన హయాంలో అన్ని గ్రామాలకు రోడ్లు వేశామన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటయ్యాయని, ఆస్పత్రులు నిర్మించామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తుండడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అభివృద్ధి దూసుకుపోతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు అశోక్, విజయ్, రాజు, నాగ్‌నాథ్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'కామారెడ్డిలో గెలిచేది కాంగ్రెస్సే'



పార్టీలో చేరిన దోమకొండ కురుమ సంఘం ప్రతినిధులతో షబ్బీర్‌అలీ

దోమకొండ: కామారెడ్డి నియోజకవర్గంలో ఎవరు పోటీలో ఉన్నా గెలిచేది కాంగ్రెస్ పార్టీనేనని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. బుధవారం దోమకొండకు చెందిన కురుమ సంఘం ప్రతినిధులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ ప్రజల్లో టీఆర్ఎస్‌పై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ హయాంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు తనను ఆదరిస్తారన్నారు. కార్యకర్తలు మరింత కష్టపడి కాంగ్రెస్‌ను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు రామస్వామిగౌడ్, సీతారం మధు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

- కర్ణాటక ఎమ్మెల్యే బీపీ హరీశ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీపీ హరీశ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రానున్న ఎన్నికల్లో ఎల్లారెడ్డిలో బీజేపీ జెండాను ఎగురవేసేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని కర్ణాటకలోని హరిహర్ ఎమ్మెల్యే బీపీ హరీశ్ సూచించారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో బుధవారం బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, బూత్ కమిటీల అధ్యక్షులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి కార్యకర్తలే బలమన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మర్రి రాంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, ఎల్లారెడ్డి విస్తారక్ అశోక్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గంపల వెంకన్న, బీజేపీ మండలాధ్యక్షుడు హన్మాండ్లు, ఉపాధ్యక్షుడు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- బీజేపీ నేతల డిమాండ్
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి



బీజేపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ కామారెడ్డి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మోటూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని బీజేపీ నాయకులు ముట్టడించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజల సొమ్ముతో నిర్మించిన క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే ఒక్కరోజు కూడా అందుబాటులో ఉండకపోవడం సిగ్గుచేటన్నారు. హామీలను నెరవేర్చకుండా మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. హామీలను నెరవేర్చకపోతే సీఎం కేసీఆర్‌ను ప్రజలు ఓడిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విపుల్, అన్నండ్ల సురేష్, నరేందర్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలి

- ప్రభుత్వ వైద్యులు శ్రీనివాస్, విజయరాజ్‌ల విజ్ఞప్తి
- చర్చనీయాంశంగా మారిన 'అంతుచిక్కని శిశు మరణాలు' కథనం

కామారెడ్డి టౌన్: శిశువులలో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలని ప్రభుత్వ జిల్లాకేంద్ర ఆస్పత్రి వైద్యులు శ్రీనివాస్, విజయరాజ్ తల్లిదండ్రులకు సూచించారు. ఇటీవల వరుసగా నమోదవుతున్న శిశువుల మరణాలపై 'అంతుచిక్కని శిశు మరణాలు' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో వైద్యులు స్పందించారు. వాతావరణంలో మార్పులతో చిన్నారుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. నిర్లక్ష్యం చేయడం వల్ల పరిస్థితి సీరియస్ అవుతోందని, గుండె కుడి భాగం దెబ్బతిని మరణాలు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. శిశువులలో దగ్గు, దమ్ము, శ్వాసకోశ సమస్యలు కనిపించగానే ఆస్పత్రికి తీసుకువస్తే సకాలంలో వైద్య సేవలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- చేపల పెంపకంతో లక్షాధికారులు కావాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



బీడీ టేకేదారులకు పింఛన్ మంజూరుకు సంబంధించిన చెక్కును అందిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: చేపల పెంపకం చేపట్టడం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపల పెంపకం, మార్కెటింగ్, సాంకేతిక అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయానికి అనుబంధంగా చేపల పెంపకం చేపట్టి మహిళలు లక్షాధికారులు కావాలన్నారు. సాంకేతిక అంశాలు, మార్కెటింగ్ మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీవో సాయన్న, అదనపు డీఆర్‌డీవో మురళీకృష్ణ, డీపీఎంలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం..

దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందని కలెక్టర్ పేర్కొన్నారు. దివ్యాంగులకు పెంచిన పింఛన్ ఉత్తర్వుల కాపీలను కలెక్టరేట్‌లో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో రూ. 3,016 పింఛన్ ఇచ్చేదని, దానిని రూ.4,016 లకు పెంచిందని పేర్కొన్నారు. బీడీ టేకేదారులు, ప్యాకర్లకు కొత్త ఆసరా పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయన్న తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ జాబితా

కామారెడ్డి క్రైం: ఓటర్ జాబితాను పకడ్బందీగా రూపొందించడంలో బూత్ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఓటర్ల జాబితా రూపకల్పనపై బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 791 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. కొత్త ఓటర్ల నమోదుపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈనెల 26, 27 తేదీలతోపాటు సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

ఓటర్ల జాబితాలో వీఐపీల పేర్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఓటరు పేరు తొలగించేముందు తప్పనిసరిగా నోటీస్ ఇవ్వాలన్నారు. జాబితాలో నకిలీ ఓటర్లు లేకుండా చూడాలన్నారు. మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు అనిల్ కుమార్, తహసీల్దార్లు ప్రేమ్ కుమార్, సాయిలు, ఇందిరా ప్రియదర్శిని, రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, అనిల్ కుమార్, నరేందర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వసతి గృహ పనులు వేగవంతం చేయాలని వినతి



కామారెడ్డి టౌన్: జీవీఎస్ కళాశాల భవనంలో కేటాయించిన ఎస్సీ కళాశాల వసతి గృహ పనులను వేగవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం, టీజేఎస్, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్, గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు సభావత్ వినోద్ పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): పంట సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఏడీఏ నూతన్ కుమార్ రైతులకు సూచించారు. బుధవారం లింగంపల్లి శివారులో సోయా పంటను పరిశీలించారు. చీడ పీడల నివారణకు పలు సలహాలు, సూచనలిచ్చారు. సర్పంచ్ చంద్రబాయి శంకర్, ఏఈవో సునంద, రైతులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి ఏఎన్ఎంల నిరసన



కామారెడ్డి టౌన్: కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమ్మె బుధవారంతో 8వ రోజుకు చేరుకుంది. ఏఐటీయూసీ, మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు చేపడుతున్న సమ్మె శిబిరంలో ఏఎన్ఎంలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించేంత వరకు సమ్మె ఆగదన్నారు. ఏఎన్ఎంలు నాగమణి, లలిత, లింబమ్మ, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. ఈ సమ్మెకు పలు పార్టీలు, సంఘాల నేతలు మద్దతు తెలిపారు.

ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలి



కామారెడ్డి టౌన్: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు రవీందర్ మాట్లాడుతూ.. పీఆర్సీ అమలు చేసి, పనిభారం తగ్గించాలన్నారు. 11 రకాల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు చంద్రశేఖర్, వెంకట్‌గౌడ్, ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

కామారెడ్డి టౌన్: జర్నలిస్టుల సంక్షేమ కోసం అందజేసే ఆర్థిక సహాయ చెక్కులను జిల్లాలోని ముగ్గురు బాధిత జర్నలిస్టు కుటుంబ సభ్యులకు బుధవారం ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అందజేశారు. జిల్లాకు చెందిన జర్నలిస్టులు గడ్డం రాజు, చంద్రకాంత్‌రావు, లాండే సంజీవ్‌లు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. బాలార్జున్‌గౌడ్, భాస్కర్, రాజు తదితరులున్నారు.

చంద్రయాన్ -3 విజయంపై సంబురాలు

సాక్షి నెట్‌వర్క్:చంద్రయాన్–3 కార్యక్రమం విజయవంతం కావడంతో జిల్లాలో సంబురాలు అంబరాన్నంటాయి. భారత్ పంపిన కృత్రిమ ఉపగ్రహం చంద్రుడి ఉపరితలంపై దిగే కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధరంగాల ప్రజలు, ప్రముఖులు ఉత్కంఠగా టీవీలకు అతుక్కుపోయి వీక్షించారు. చంద్రుడి, విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా దిగిందని తెలియడంతో పలు చోట్ల టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. పలు కాలేజీలు, స్కూళ్లలో వీక్షించడానికి ప్రత్యేకంగా భారీ ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. చంద్రయాన్–3 విజయవంతం కావాలని పూజలు కూడా చేశారు. చంద్రుడిపై కాలుమెపిన నాలుగో దేశంగా భారతదేశం చరిత్ర సృష్టించిందని పలువురు ఆనందం వ్యక్తం చేశారు. వందేమాతం అంటూ నినాదాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది.



జిల్లా కేంద్రంలో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు



ఎల్లారెడ్డి పట్టణంలోని గురుకుల పాఠశాలలో తిలకిస్తున్న విద్యార్థులు



గాంధారిలో..



దోమకొండ గురుకుల పాఠశాలలో..



నస్రుల్లాబాద్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నేతలు



జిల్లా కేంద్రంలో టపాసులతో సంబురాలు



నాగిరెడ్డిపేట గిరిజన గురుకుల పాఠశాలలో..



లింగంపేటలో ..



తాడ్వాయి పాఠశాలలో..



ఎల్లారెడ్డిలో టపాకాయలు కాలుస్తున్న యువకులు

రీజనింగ్‌తో పోటీ పరీక్షల్లో విజయం

కామారెడ్డి అర్బన్: అర్థమెటిక్, రీజనింగ్‌లో ప్రావీణ్యం ఉంటే విద్యార్థులు పోటీ పరీక్షల్లో సులభంగా విజయం సాధించే అవకాశం ఉంటుందని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య అన్నారు. కళాశాలలో టాస్క్, టీఎస్‌కేసీ సంయుక్త ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు రెండు రోజుల పాటు నిర్వహించిన అర్థమెటిక్, రీజనింగ్ శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. సాధారణ విద్యతో పాటు పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు శిక్షకుడు రఘుతేజ అన్నారు. సమన్వయకర్త ఫర్వీన్ ఫాతిమా, మెంటర్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కిష్టయ్య

గుణాత్మక విద్యను అందించాలి

కామారెడ్డి టౌన్: లక్ష్య ఉన్నతి కార్యక్రమాలు విజయవంతం కావడానికి ఉపాధ్యాయులకు ప్రేరణ కలిగించే బాధ్యత ప్రధానోపాధ్యాయులదే అని జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి లింగం అన్నారు. కామారెడ్డి ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన ప్రధానోపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యవేక్షణ సక్రమంగా చేసినప్పుడే పాఠశాలలు సమర్థవంతంగా నిర్వహించగలుగుతామని అన్నారు. విద్యార్థులకు సరైన గుణాత్మక విద్య అందించాలని దీనికి ప్రతీ ఒక్క హెచ్ఎం, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, ఎంఈవో రామస్వామి, రీసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఘన సన్మానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): చైనా దేశంలోని ఫిజియన్ ప్రావిన్స్, ఫింగ్‌టన్ సిటీలో ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు నిర్వహించే జూనియర్ సాఫ్ట్‌బాల్ (అండర్–18) ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. పోటీల్లో భారతజట్టు సభ్యులుగా నిజామాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారిణులు లకావత్‌రాణి (సాంఘిక సంక్షేమ కళాశాల, సుద్దపల్లి), అజ్మీర ఇందు (సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాల, ఆర్మూర్) ఎంపికయ్యారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ నవీన్ నికొలస్ హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో క్రీడాకారిణులను ఘనంగా సన్మానించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమన్నారు.

అక్టోబర్ 3 నుంచి ప్రీ పీహెచ్‌డీ రెగ్యులర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): టీయూ పరిధిలోని పరిశోధక విద్యార్థులకు అక్టోబర్ 3 నుంచి ప్రీ పీహెచ్‌డీ రెగ్యులర్ / బ్యాక్‌లాగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ బుధవారం తెలిపారు. 2022–2023 రెగ్యులర్ స్కాలర్స్‌తో పాటు 2013–14 బ్యాక్‌లాగ్ పరిశోధక విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. ఆర్ట్స్, సోషల్ సైన్స్, ఎల్ఎల్‌బీ, కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సైన్స్ కోర్సులకు సంబంధించిన విద్యార్థులు సెప్టెంబర్ 16లోగా ఫీజు చెల్లించాలన్నారు. రూ.500 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 21వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. మొదటి పేపర్ అక్టోబర్ 3న, రెండో పేపర్ పరీక్షలు 4న నిర్వహించనున్నట్లు తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

తెయూ(డిచ్‌పల్లి): టీయూ పరిధిలో కొనసాగుతున్న బీఈడీ, పీజీ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం నిర్వహించిన బీఈడీ మొదటి సంవత్సరం పరీక్షలకు 141 మంది విద్యార్థులకు గాను 127 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పీజీ రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 1939 మంది విద్యార్థులకు గాను 1782 మంది హాజరు కాగా 157 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి ఉన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేటకు చెందిన మత్తమాల సిద్ధిరాములు (45) మెదక్ జిల్లా చిన్న శంకరంపేట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిరాములు ఏడాది క్రితం బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడని, అక్కడే కూలీ పనులు చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల తన తల్లి అంజవ్వ అనారోగ్యానికి గురికావడంతో స్వగ్రామానికి వచ్చిన సిద్ధిరాములు బుధవారం తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై హైదరాబాద్‌కు బయలుదేరాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట సమీపంలోని కొర్విపల్లి వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ సిద్ధిరాములును ఢీకొన్నది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్ధిరాములు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య నాగరాణి, కుమారుడు, కూతురు ఉన్నారు.



రోడ్డుప్రమాదంలో మృతిచెందిన సిద్ధిరాములు

ఆలయంలో చోరీ

పెద్దకొడప్‌గల్ (జుక్కల్): పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని పాపహరేశ్వర ఆలయంలో మంగళవారం చోరీ జరిగినట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. ఆలయ పూజారి బుధవారం ఉదయం ఆలయం తెరిచి చూడగా హుండీని ధ్వంసం చేసి నగదును దోచుకెళ్లినట్లు చెప్పారు. ఆలయంలోని సీసీ ఫుటేజీని పరిశీలించగా మధ్యాహ్నం చోరీకి గురైనట్లు గుర్తించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వార్డుబాయ్‌పై కేసు నమోదు



ఖలీల్‌వాడి: నగరంలోని మనోరమ ఆస్పత్రిలో వార్డు బాయ్‌గా పని చేస్తున్న ఆకుల సత్యనారాయణపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. గుండె వ్యాధితో మనోరమ ఆస్పత్రిలో అడ్మిట్ అయిన మోహన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో మోహన్ జేబులో నుంచి పర్సుతో పాటు ఏటీఎం కార్డును వార్డు బాయ్ సత్యనారాయణ దొంగిలించాడు. విషయాన్ని గమనించిన మోహన్ కుమారుడు దీపక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు సత్యనారాయణ దొంగిలించిన ఏటీఎం కార్డుల నుంచి రూ.59 వేల నగదు తీసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

డెంగీతో యువకుడు..



సంపత్‌కుమార్‌గౌడ్ (ఫైల్)

ఎడపల్లి (బోధన్): మండల కేంద్రానికి చెందిన సంపత్‌కుమార్ గౌడ్ (21) డెంగీ వ్యాధితో బుధవారం మృతి చెందాడు. డెంగీకి గురైన సంపత్ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి ..

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలం శెట్పల్లి గ్రామానికి చెందిన వడ్ల కాశీరాం(52) మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. కాశీరాం ఉపాధి నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి 15 ఏండ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈ నెల 17న స్వగ్రామం శెట్పల్లికి వచ్చిన కాశీరాం అదే రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కలా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం మెంగారం అటవీ ప్రాంతంలో మృతదేహం లభించినట్లు ఎస్సై తెలిపారు. కాశీరాం ఆత్మహత్య చేసుకున్నాడా, ఎవరైన హత్య చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిందితుడికి రిమాండ్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మొబైల్ షాప్‌లో దొంగతనం చేసిన నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కోనా రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మోను మొబైల్ షాప్‌లో దొంగతనానికి పాల్పడిన పెద్దకొడప్‌గల్‌కు చెందిన గైని సాయికుమార్‌ను సీసీపుటేజీ ద్వారా గుర్తించి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు మద్యానికి బానిసై దొంగతనాలకు అలవాటుపడినట్లు చెప్పారు. కేసును త్వరగా పరిష్కరించిన పోలీసు సిబ్బంది గోరి, అంజి, రవి, రమేశ్‌ను ఎస్సై అభినందించారు.

బీజేపీ నాయకులపై కానిస్టేబుల్ ఫిర్యాదు

బాన్సువాడ: బాన్సువాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మంగీలాల్‌ను నెట్టేసి ఆందోళన చేసిన బీజేపీ నాయకులపై మంగిలాల్ ఫిర్యాదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. బీజేపీ నాయకులు మల్యాద్రిరెడ్డి, కొత్తకొండ భాస్కర్, లక్ష్మీనారాయణ, గుడుగుట్ల శ్రీనివాస్, కోనాల గంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, చిదుర సాయిలు, వడ్ల శేఖర్, గంగారాం, హన్మాండ్లు, స్వామిగౌడ్, శంకర్, హరికృష్ణ, వినాయక్‌రెడ్డి, ప్రకాశ్‌పటేల్, శంకర్‌రెడ్డి, అభిలాశ్‌రెడ్డి, గోవర్ధన్‌పై ఫిర్యాదు చేశారని చెప్పారు. విచారణ చేసి కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

కామారెడ్డిలో కాషాయ జెండా రెపరెపలాడాలి

- మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి



మాట్లాడుతున్న సచిన్ కల్యాణ్ శెట్టి

దోమకొండ: కామారెడ్డిలో అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు పోటీ చేసినా కాషాయ జెండా రెపరెపలాడాలని మహారాష్ట్రలోని అక్కోల్‌కోట్ బీజేపీ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేసినా ఆయనను బీజేపీ ఓడిస్తుందన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలంగా ఉందన్నారు. నియోజకవర్గంలో బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి కొంత కాలంగా ప్రజాసేవలో ఉన్నారన్నారు. ప్రజాసమస్యలపై పోరాడే వ్యక్తిగా గుర్తింపు పొందారని వివరించారు. పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు చింతల రాజేష్, నాయకులు గంగాజమున, రవీందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదతరులు ఉన్నారు.

కేసీఆర్ సభకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి): మెదక్ పట్టణంలో బుధవారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రగతి నివేదన సభలో పాల్గొనేందుకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి బైక్‌ర్యాలీగా వెళ్లారు. లింగంపేట, తాడ్వాయి, నాగిరెడ్డిపేటతో పాటు పలు మండలాల నుంచి కూడా భారీగా కార్యకర్తలు బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.



నాగిరెడ్డిపేట నుంచి మెదక్ పట్టణానికి ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే సురేందర్, కార్యకర్తలు

‘గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్దాం’

మద్నూర్(జుక్కల్): బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకెళ్లాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి, అసోం ఎమ్మెల్యే అజయ్ కుమార్ అన్నారు. బుధవారం మద్నూర్‌లో జిల్లా అధ్యక్షులు అరుణతార ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బీజేపీ పుంజుకుందని, ఏ గ్రామానికి వెళ్లినా ప్రజాదరణ వస్తోందన్నారు. కార్యకర్తల కృషితో పార్టీ బలోపేతమైందన్నారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలవడం ఖాయమని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. బూత్ లెవెల్లో కార్యకర్తలు పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న అసోం బీజేపీ ఎమ్మెల్యే అజయ్

జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సలాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని అదనపు తరగతి గదులను ఇంటర్ క్లాసుల నిర్వహణకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని ఆయా గ్రామాల తల్లిదండ్రులను కోరారు. ఆయన వెంట జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, గైని విఠల్, మనోహర్, వాజిద్ అలీ, నర్సింహారెడ్డి, సంఘమేశ్వర్‌గౌడ్, , తదితరులు ఉన్నారు.



కళాశాల భవనాలను పరిశీలిస్తున్న అధికారి షేక్ సలాం, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు

లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించాలి

ఖలీల్‌వాడి: జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ అయ్యే కేసులను పరిష్కరించాలని మొదటి అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ అన్నారు. నగరంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి జడ్జి హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ 9న నిర్వహించే లోక్‌అదాలత్‌లో జిల్లాలో అత్యధికంగా కేసులను పరిష్కారించాలని సూచించారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, జడ్జి కుష్బూ ఉపాధ్యాయ, పీపీ రహీమొద్దీన్, ఏసీపీ కిరణ్‌కుమార్, సీసీఆర్‌బీ రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జడ్జి కనకదుర్గ

బోధన్‌లో విద్యార్థుల రాస్తారోకో



బోధన్: సాలూర మండల కేంద్రం నుంచి పట్టణ కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ భారతీయ విద్యార్థి సేన ఆధ్వర్యంలో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి బుధవారం నిరసన తెలిపారు. గతంలో బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి విన్నవించినా పరిష్కరించలేదన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు డిపో అధికారులు, రూరల్ ఎస్సై నాగ్‌నాథ్ ఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.

డీఈవోకు చేరిన విచారణ నివేదిక

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని బీబీసీ పాఠశాలకు సంబంధించిన విచారణ నివేదిక బుధవారం జిల్లా విద్యాధికారికి చేరింది. దారుగల్లి హెడ్‌మాస్టర్ శంకర్ బీబీసీ పాఠశాల చైర్మన్ ప్రవీణ్ విద్యార్థినిని బయటకు తీసుకెళ్లిన ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. విద్యార్థినిని కూడా ప్రశ్నించారు. విచారణ నివేదికను విద్యాధికారికి అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఏసీ రిపేరింగ్ (30 రోజులు), టూ వీలర్ మెకానిక్ (30 రోజులు), సీసీటీవీ రిపేరింగ్ (13 రోజులు) కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పిస్తారని తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులు, 19 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగి ఉన్న వారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వెంట ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, పదో తరగతి ధ్రువీకరణ పత్రం, ఐదు ఫొటోలతో వచ్చి డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ ఆర్ఎస్ఈటీఐ శిక్షణ కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 08461–295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: ధైర్య సాహసాలను ప్రదర్శించి ఆపదలో ఉన్న బాల బాలికలను రక్షించిన బాలలు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్–2023కు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ, మహిళా శిశువు దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ అధికారి రసూల్ బీ తెలిపారు. నూతన ఆవిష్కరణలు, ఆటలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్య సాహస కార్యక్రమాలు, పలు అంశాలకు ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అవార్డులకు 18 ఏండ్ల లోపు ఉన్న బాల బాలికలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు https:// awards. gov. inలో వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

అత్యాచారం కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: మహిళ హత్య కేసులో ఇద్దరు నిందితులకు జడ్జి టి.శ్రీనివాస్ జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 2019 జూన్ 2న కామారెడ్డిలోని సిరిసిల్ల రోడ్డు ప్రాంతానికి చెందిన శివాజీ పవర్, ఆస్తుల అశోక్ తమ ఇంటికి దగ్గరలో ఉన్న లక్ష్మి (35) అనే మహిళను అత్యాచారం చేసి హత్య చేసినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని బాధితురాలిని ఆస్పత్రిలో చేర్పించారు. అదే రోజు లక్ష్మి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు అత్యాచారం, హత్య కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపారు. నాటి నుంచి కేసు నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు పరిశీలనలో ఉంది. కేసును పరిశీలించిన జడ్జి శ్రీనివాస్ నేరం రుజువు కావడంతో నిందితులను జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించారు. కేసు పరిశోధన చేసిన అప్పటి సీఐ జి.రామకృష్ణ, డీఎస్పీ లక్ష్మీనారాయణ, ప్రస్తుత సీఐ నరేశ్, పీపీ కవితారెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సంతోష్, లైసనింగ్ అధికారులు విఠల్, హన్మాండ్లును ఎస్పీ శ్రీనివాసరెడ్డి అభినందించారు.